క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత నాగమణికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేరువేరుగా బుధవారం రూ.1,51,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తాడేపల్లిగూడేనికి చెందిన కొవ్వూరి నాగమణి రూ.1,01,116, గతంలో ద్వారకాతిరుమల మండలం ఎంపీడీవోగా పని చేసి, ప్రస్తుతం సొంత జిల్లా శ్రీకాకుళంలో విధులు నిర్వర్తిస్తున్న రఘుపాత్రుని తిరుపతిరావు రూ.50,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించి, స్వామి వారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

ముగిసిన చెస్ పోటీలు

జంగారెడ్డిగూడెం: మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ స్టేట్ రాపిడ్ అండ్ చెస్ పోటీలు బుధవారం ముగిశాయి. స్థానిక చిట్టూరి గణేశ్వర టౌన్‌హాల్‌లో ఈ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సీహెచ్ వర్మ విజేతలను అభినందించారు. విజేతలతో పాటు, పాల్గొన్న చెస్ క్రీడాకారులకు నగదు, ప్రశంసా పత్రాలను, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో సిటీకేబుల్ ఎండీ చిన్ని హరీష్ గుప్త, టౌన్‌హాల్ ప్రెసిడెంట్ సచివరపు బుల్లి బుల్లయ్య, మద్దిపాటి నాగేశ్వరరావు, అలుగు ఆనందశేఖర్, రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ ఎస్.రాధాకృష్ణ, మాస్టర్‌చెస్ అకాడమీ కార్యదర్శి ఎస్ఎస్ చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ కన్వీనర్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

దెందులూరు: దెందులూరులో బుధవారం పేకాడుతున్న 9మంది జూదరులను అరెస్ట్ చేశామని ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. రూ.5,720 నగదు, ఆటో, మోటార్ బైక్, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు. మండలంలో ఏ గ్రామంలోనైనా పేకాట, కోడిపందేలు, గుండాటతో పాటు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన, సహకరించిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. పాత నేరస్తులపై పూర్తిస్థాయిలో నిఘా ఉంటుందని ఆయన అన్నారు.

అక్కంపేటలో..

జంగారెడ్డిగూడెం: పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు అక్కంపేటలో దాడి నిర్వహించామన్నారు. ఈ దాడిలో రూ.3300 నగదు స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రచారం ఘనం.. పనులు శూన్యం

- రోడ్ల మరమ్మతులు పూర్తి చేసినట్లు ప్రచారం
- నేటికీ పూర్తికాని ప్యాచ్ వర్కులు

ఏలూరు (టూటౌన్): ఓ ప్రక్క కూటమి ప్రభుత్వం రోడ్ల మాసోత్సవాల పేరుతో అన్నిరోడ్లను ప్యాచ్ వర్కులు చేసి గుంతలు లేని రహదారులే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ప్రకటిస్తున్నా అది కేవలం ప్రకటనలకే పరిమితమై పోయిందే తప్ప పూర్తిస్థాయిలో రోడ్ల మరమ్మతులు చేపట్టలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని వన్‌టౌన్,టూటౌన్, త్రీ టౌన్ పరిధిలో అన్ని రహదారుల్లో ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించారు. ఒకటి రెండు చోట్ల రోడ్డు పనులు ప్రారంభించినట్లుగా ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. తమ ప్రభుత్వం అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందంటూ ప్రకటనల ఆర్భాటం చేశారు. తీరా చూస్తే నగరంలో ఎక్కడి గోతులు అక్కడే దర్శనమిస్తున్నాయి. రోడ్డు వేస్తున్నామని, గోతులు పూడుస్తున్నామంటూ ప్రజా ప్రతినిధులు, అధికారులు చేస్తున్న హడావుడి, ప్రకటనలు చేస్తున్న సామాన్య ప్రజలు నిజమేనని నమ్మి తాజాగా ఎక్కడి గోతులు అక్కడే కనిపిస్తుండడంతో ముక్కున వేలేసుకుంటున్నారు. పై పైన గోతులు పూడ్చి నిధులను ఖర్చు పెట్టినట్లు చూపి చేతులు దులుపేసుకుంటున్నారని ప్రజలు చెబుతున్నారు.

కార్పొరేషన్‌లో రూ.1.25 కోట్ల నిధుల కేటాయింపు

ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో రోడ్ల మరమ్మతుల కోసం రూ.1.25 కోట్లు నిధులను కేటాయించారు. వీటిలో స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని బీటీ రోడ్డును రూ.24 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. వన్‌టౌన్‌లో మరో రూ.26 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మిగిలిన రూ.75 లక్షలు ప్యాచ్ వర్కులకు ఖర్చు చేయనున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నా వాస్తవంగా క్షేత్ర స్థాయిలో ఆ మేరకు పనులు జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. అక్కడక్కడ గోతులు పూడ్చి మమ అనిపించేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వంగాయగూడెం ప్రాంతంలోని గోతులతో కన్పిస్తున్న రహదారి



వంగాయగూడెంలో పూర్తిగా కంకరు లేచిపోయి గోతులు పడిన రోడ్డు



వంగాయగూడెంలో పూర్తిగా కంకరు లేచిపోయి గోతులు పడిన రోడ్డు



పంపుల చెరువు రోడ్డులో గుంతలుగా ఉన్న రహదారి

నాణ్యతా లోపాలు

మరోవైపు అక్కడక్కడా చేపట్టిన రోడ్డు మరమ్మతుల పనులు చేసిన కొద్ది రోజులకే కంకర లేచిపోతున్నాయి. నగర పాలక సంస్థలోని రహదారులతో పాటు ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో చేపట్టిన రహదారులదీ ఇదే పరిస్థితి. కేవలం మొక్కుబడిగా పనులు చేసి బిల్లులు చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన రహదారుల్లో ఉన్న గోతులను పూడ్చుతున్న సంబంధిత అధికారులు మిగిలి రోడ్ల మరమ్మతులకు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతున్నాం



నగరంలోని పలు రోడ్లను తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా అవి ఎందుకూ అక్కరకు రావడం లేదు. స్థానిక పంపుల చెరువు, వంగాయగూడెం, గొల్లాయగూడెం ప్రాంతాల్లోని రోడ్లు గోతులతో దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఈ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు జాగ్రత్తగా ఉండకపోతే ప్రమాదాలకు లోనవుతున్నారు. తక్షణం రోడ్లు అన్నీ మరమ్మతులు చేయాలి.

– బొల్లారపు నాగరాజు,స్థానికుడు, బాప్టిస్ట్ పేట,ఏలూరు

రూ.1.25 కోట్లతో రోడ్ల మరమ్మతులు



ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్ల పరిధిలో ఉన్న రోడ్ల మరమ్మతుల కోసం రూ.1.25 కోట్లు నిధులు వెచ్చిస్తున్నాం. దాదాపు 600 వరకూ గోతులను గుర్తించాం. వీటన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూడ్చే పనులను చేపట్టాం. ఇప్పటికే సగానికి పైగా పనులు పూర్తి చేశాం. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎ.భానుప్రతాప్, కమిషనర్, ఏలూరు నగర పాలక సంస్థ

కోటదిబ్బ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజ్‌కృష్ణ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎ.రాజ్‌కృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన ధనుంజయరావు గత జూన్‌లో పదవీ విరమణ చేయగా అప్పటి నుంచి కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకుడు విశ్వనాథ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా బుధవారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజ్‌కృష్ణ ఇప్పటివరకు తణుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. బాధ్యతలు స్వీకరించిన రాజ్‌కృష్ణకి కళాశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): అజాత శత్రువు, భారత రత్న, మాజీ ప్రధాని వాజ్‌పేయి అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ కొనియాడారు. వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యాలయంలో ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీ గాదె రాంబాబు గారి అధ్యక్షతన జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో బుధవారం ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు శ్రీ చౌటపల్లి విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ వాజ్‌పేయి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మద్దాని దుర్గారావు, నడపన దాన భాస్కరరావు, మరకా రామకృష్ణ, నాగం శివ, గుమ్మడి చైతన్య, ఇలపకుర్తి కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఏలూరు (టూటౌన్): సీపీఐ శత వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమవుతాయని, ఈ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సీపీఐ శత వార్షికోత్సవాల వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో సామ్యవాద వ్యవస్థ స్థాపన కోసం 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సీపీఐ ఈనెల 26వ తేదీ నాటికి 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా వాడవాడలా సభలు,సమావేశాలు నిర్వహించి దేశంలో,రాష్ట్రంలో,జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ చేసిన పోరాటాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. లోక్ సభ సాక్షిగా రాజ్యాంగాన్ని గౌరవిస్తామంటూనే హోం మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దీనికి నిరసనగా సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 30న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య పాల్గొన్నారు.



ఏలూరు అమీనాపేట లూథరన్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా భారీ కేక్‌ను కట్‌చేస్తున్న పాస్టర్, నిర్వాహకులు



ఏలూరు సెయింట్ థెరిస్సా చర్చిలో క్రిస్మస్ సందేశం అందిస్తున్న బిషప్ పొలిమెర జయరావు

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

- విశ్వాసులతో కిక్కిరిసిన చర్చిలు
- క్రిస్మస్ సందేశం ఇచ్చిన పాస్టర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేవుని బిడ్డగా ఏసు ప్రభువు జన్మించి తన రక్తంతో పాప పరిహారం చేసిన గొప్ప శాంతి దూత అని ఏలూరు కథోలిక పీఠం బిషప్ జయరావు పొలిమేర అన్నారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి కథీడ్రల్ చర్చిలో మంగళవారం అర్ధరాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో బిషప్ క్రీస్తు సందేశాన్నిచ్చారు. లోక రక్షణ కోసమే ఏసుక్రీస్తు జననం సంభవించిందని అన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి విశ్వాసులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఫాదర్ మైఖేల్ ఇంజమూల, ఫాదర్ జీ. మోజెస్, బిషప్ హౌస్ కోశాధికారి ఫాదర్ రాజు బేతంపూడి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఐసీఎం సంఘాల కథడ్రల్ చర్చిలో నిర్వహించిన క్రిస్టమస్ వేడుకల్లో బిషప్ జాన్ ఎస్‌డీ రాజు క్రీస్తు సందేశమిస్తూ క్రీస్తు ఆరాధనలో ప్రపంచ ప్రజలు శాంతితో మెలగాలన్నారు. కార్యక్రమంలో కథడ్రల్ సంఘస్తులతో పాటు ఆయా ప్రాంతాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని ఏఆర్ పోలీస్ లైన్ చర్చిలో శాంతి సౌఖ్యాలతో విలసిల్లేలా చేయాలని బిషప్ ఎం.ఎలీషా రాజు, జ్యోతిరాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాతబస్టాండు సమీపంలోని సీఎస్ఐ చర్చ్, అమీనాపేట రిజర్వ్ పోలీస్ లైన్ సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలతో పాటు నగరంలోని అన్ని చర్చిల్లో, క్రైస్తవ సంఘాల్లో బుధవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



అమీనాపేటలోని ఏఆర్ పోలీస్ లైన్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు



చర్చిలో కీర్తలను ఆలపిస్తున్న యువతులు



ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియం వద్ద ఉన్న ఐసీఎం చర్చిలో క్రిస్మస్ సందేశం అందిస్తున్న బిషప్ జాన్ ఎస్‌డీ రాజు



చర్చిలో క్రీస్తు పుట్టుక విశేషాలను తెలిపేలా ఏర్పాటు చేసిన పూరిపాక సెట్టింగ్

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	09
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	14
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	21
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	48	బీన్స్‌చిక్కుడు	68
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	44
బెండకాయలు	32	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28-34	కంద	60
కాకర కాయలు	34-44	బీట్‌రూట్	56
బీరకాయలు	30	కీరా దోస	42
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	28	అల్లం	70
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	48-52	పాలకూర	10
బంగాళదుంపలు	32-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	07
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

మనుస్మృతి పత్రాల దహనం



మనుస్మృతి పత్రాలను దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు

జంగారెడ్డిగూడెం : స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు తొర్లపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనారిటీ వర్గాలు ఇప్పటికీ అట్టడుగున దిక్కుతోచని స్థితిలో ఉండటానికి ఈ మనుస్మృతి కారణమని ఆ నాడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ బహిరంగంగా మనుస్మృతి పత్రాలను దహనం చేశారన్నారు. అదే బాటలో మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు కలపాల రాజకుమార్, బ్యాటరీ నాగు, కోట్నీస్, మహిళా అధ్యక్షురాలు ఎండీ సలీమా, మాల మహానాడు టౌన్ ప్రెసిడెంట్ వెంపల రాజు, రాణి, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో ధనుర్మాసోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో గోదాదేవి

జంగారెడ్డిగూడెం: గోదాదేవి అనుగ్రహించిన తిరుప్పావై పాశురాల్లో వేద జ్ఞానం ఇమిడి ఉందని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు తెలిపారు. శ్రీరంగనాథుడి అనుగ్రహం కోసం గోదాదేవి అందించిన తిరుప్పావై 30 పాశురాలలో వేదాలు, ఇతిహాసాలు, పురాణాల్లో పేర్కొన్న పలు అంశాలు సరళంగా ఉన్నాయని తెలిపారు. ధనుర్మాస వ్రత సందర్భంగా పదో రోజు పారిజాతగిరి ఆలయంలో గోదాదేవికి శ్రీకృష్ణుడికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో విశేష సంఖ్యలో భక్తులు, వికాస తరంగిణి కార్యకర్తలు పాల్గొన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోరుబాటతో ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

గణపవరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి, ప్రజలపై పన్నుల బాదుడు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వ కళ్లు తెరిపించాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27న చేపట్టనున్న పోరుబాట కార్యక్రమం పోస్టర్లను ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఓట్లువేసిన ప్రజలను దగా చేస్తోందని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజల నడ్డివిరిగేలా పన్నులు వేసి, బాదుడు కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. విద్యుత్ చార్జీల భారం రూ.13,500 కోట్లు గత ఆరునెలల్లో ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేసిందని ఆయన విమర్శించారు. కొత్త సంవత్సరంలో మరో పదివేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీల వడ్డించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలను బూటకపు హామీలతో నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలన్నింటినీ చాపచుట్టేసిందన్నారు. చంద్రబాబు మోసాలపై వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన ఆందోళనలు చేపడుతుందన్నారు. హామీలను అమలుచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తుందని అన్నారు. దీనిలో భాగంగా ఈనెల 27న విద్యుత్ బిల్లుల మోతపై ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఈనెల 27న ఉదయం పది గంటలకు నారాయణపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆందోళనకు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని, తద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపిద్దామని వాసుబాబు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, కనుమాల రామయ్య, జెడ్పీటీసీలు దేవారపు సోమలక్ష్మి బాబులు, కోడే కాశీ, తుమ్మగుంట రంగాభవాని, నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్, మరడ మంగారావు, రావిపాటి సత్యశ్రీనివాస్, పార్టీ నాయకులు వెజ్జు వెంకటేశ్వరరావు, పుప్పాల గోపి, ఎలిశెట్టి బాబ్జీ, ధనుకొండ శ్రీను, రొంగల శ్రీను, రామకుర్తి నాగేశ్వరరావు, కాన్వెంట్ శ్రీను, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సూర్యబలిజ విభాగం అధ్యక్షుడు శెట్టి రాజా పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న పుప్పాల వాసుబాబు